"శ్రీహరిరావుగారు స్వంతఇల్లు కట్టుకున్నారుట గదా! ఈ రోజు వాళ్ళావిడ వచ్చి గృహప్రవేశానికి పిలిచింది."

అన్నం వడ్డిస్తూ అంది శ్రీమతి.

"అవును ఆఫీసు వాళ్ళందర్నీ ఫేమిలీస్‌తో సహా పిలిచాడులే. వెళ్దాం" అన్నాను భోజనం కానిస్తూ.

శ్రీమతి రెండు మూడుసార్లు ఏదో అనబోయి మానేసింది.


భోజనం చేసేటప్పుడు ఏదైనా సమస్యను చర్చించటం నాకిష్టం వుండదని యిన్నాళ్ళ వైవాహిక జీవితంలో ఆవిడ తెలుసుకునే వుంది. భోజనం పూర్తిచేసి వాలుకుర్చీలో కూర్చుని పేపరు చూస్తున్నాను. శ్రీమతి అన్నిపనులూ చూచుకుని, తాంబూలం పట్టుకుని ప్రక్కనే వచ్చి కూర్చుంది. పిల్లలు వరండాలో చదువుతూ కునికిపాట్లు పడ్తున్నారు.

"ఏమండీ శ్రీహరిరావుగారు ఆఫీస్‌లోనే లోన్ తీసుకుని ఇల్లు కట్టారుట కదా మరి మీరాయనకంటే సీనియరేకదా మీకెందుకివ్వరు లోను?"

"ఎందుకివ్వరు?" అన్నాను పేపరునుండి దృష్టి మరల్చకుండానే.

"ఐతే ఈ అద్దెకొంపల్లో బాధపడేకంటే మనమెందుకు ఇల్లు కట్టుకోకూడదు? ఆఫీస్‌లో లోన్ కూడా వస్తుందికదా?" క్షణం మాట్లాడలేదు నేను.

"ఏమండీ పలకరేం? ఈ యింటికి రెండు వందలు అద్దె యిస్తున్నామే కాని ఒక్క సదుపాయం లేదు. గాలి సరిగ్గా రాదు. పగలు కూడా ఫేన్ ఎక్కడ వేసేస్తామేమోనని యింటాయన



# స్వంత ఇల్లు

మాచిరాజు నీలమణి జోగారావు

ఉదయం అవగానే మెయిన్ ఆఫ్ జేసేస్తాడు. కుళాయిలో నీళ్ళు అర్ధరాత్రి వస్తాయి. పోనీ నుయ్యి వాడుకుందామంటే అది పాతాళంలోకి వుంటుంది''

నేను పేపరు తిరగెయ్యటం మానలేదు.

"నేను చెప్పేది కాస్త వినండి. ఆ పేపరులో ఏముంది? ఇల్లిక్కడ రైలు ప్రమాదం. అల్లక్కడ లాఠీఛార్జీలు అనేకదా''

"ఇప్పుడేమంటావు? ఆ శ్రీహరిరావు ఇల్లు కట్టుకున్నాడంటే అతనికి వాళ్ళ మావగారు రాసిచ్చిన జాగావుంది. నాకు మా మామగారు....''

"హు" మూతి మూడు వంకర్లు విరిచింది. "జాగా యియ్యకపోతేనేం? కట్నం యిచ్చారు కదా? అది బ్యాంకులో వేసుకుంటే యిప్పుడు ఎంతవును? ఎంతసేపూ మావాళ్ళ ననటమే మీపని. మీరు చేసిన ఖర్చులూ అవీ...''

"అబ్బ నీ సణుగుడు కట్టిపెట్టు. నిద్ర వస్తోంది."

"అవును. మీకెంతసేపు ఆఫీసు, రాజకీయాలు. అంతే, యింట్లో ఏమిటి అన్నధ్యాసలేదు. పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. కనీసం వాళ్ళు చదువుకోటానికి వేరే రూమ్ వుండాలనైనా తోచదు''

నా మంచం మీద దుప్పటి ఒకసారి గట్టిగా దులిపివేసి దూరంగా తన మంచం మీద ముసుగు పెట్టింది.


నిజమే. పిల్లలు పెద్దవాళ్ళౌతున్నారు. ఏ మాత్రం ప్రైవసీ లేకుండా పోయింది. యింకో రూమ్ వుంటే బాగుండును.

నిజానికి స్వంత యిల్లు కట్టుకుంటే బాగుండునని నాకూ చాలా కాలంనుంచీ కోర్కె వుంది. కాని ఆఫీసులో యిళ్ళు కడ్తున్న కొలీగ్స్ అవస్థలు చూస్తుంటే ఆ జోలికి పోవాలని పించడంలేదు.

"ఇప్పుడు చేతికి వచ్చిన డబ్బు చాలక నానా బాధా పడ్తున్నాము. ఇంకా అడ్వాన్సు తీసుకుని, ఆ కటింగు కూడా వుంటే యిల్లెలా గడుస్తుంది?'' అన్నాను గట్టిగా దుప్పటి పైకిలాక్కుంటూ.

"అప్పుడు అద్దెయిచ్చుకో అక్కర్లేదుకదా. ఆ కటింగు కది సరిపోతుంది. లేకపోతే యింకో పాతికో యాభయ్యో ఎక్కువవుతుందేమో. అయినా ఎలాగో సర్దుకోవచ్చు. ఇల్లంటూ వుండాలిగాని. ఏమైనా చేసుకోవచ్చు'' ముసుగు తీయకుండానే సమాధానం....

మర్నాడు యింటి యజమాని వచ్చి, పైనెల



అర కప్పు పాలలో సగం నిమ్మ పండు పిండి బాగా కలిపి ఆ మిశ్రమాన్ని పడుకునే టప్పుడు ముఖానికి పట్టించుకున్నట్లయితే ముఖం ఆకర్షణీయంగా వుంటుంది.

నుండీ యింకో పాతిక డబ్బెక్కువ చెయ్యాలనీ లేదంటే ఖాళీ చెయ్యమని తాఖీదిచ్చాడు. యిలాగే ఆరేళ్ళుగా ప్రతీ యేడాదీ రుడిపిస్తూనే వున్నాడు. నేను అద్దె ఎక్కువ చేస్తూనే వున్నాను. ఈ బోడి ఇంటికి యింకా ఎక్కువా? లాభం లేదు. స్వంత ఇల్లు వుండవలసిందే. నేను కూడా కృత నిశ్చయానికి వచ్చాను.

❋

ఇల్లు కట్టాలంటే ముందు సైట్ కొనాలికదా. ఇద్దరు ముగ్గురు మిత్రులతో చెప్పి జాగాల వేట ప్రారంభించాను. టౌన్ ఏరియాలో అసలు జాగాలు దొరకటమే కష్టం. ఒకవేళ వున్నా దాని ఖరీదు.., ఒక గజం ఖరీదు మాకు ఒకనెల యింటి అద్దె అంత...అమ్మబాబోయ్ లాభంలేదు. పోనీ ఊరికి దూరంగా కొందామంటే....కొన్ని జాగాలు స్టీల్ ప్లాంట్ ఎక్విజిషన్‌తో వున్నాయి. యిటువైపు గవర్నమెంటు వాళ్ళ ఎక్విజిషన్ ఒకవైపు టౌన్ ప్లానింగ్ వాళ్ళు కొంటున్నారు. చచ్చాంరా భగవంతుడా జాగాయే దొరకకపోతే యింక ఇల్లెలా కడతాను?

నేను నిరుత్సాహపడినా మా మిత్రులూరుకోలేదు. ఆదివారం వచ్చిందంటే చాలు, ఇల్లిక్కడ ప్లాట్లు వేస్తున్నారట. అక్కడ అమ్మకానికి సైట్లు వున్నాయిట, అని లాక్కునిపోయేవారు.

ఎలాగైతేనేం నాలాంటి వాళ్ళు కూడా యింకా చాలామంది వున్న కారణంగా వూరికి ఎనిమిది మైళ్ళ దూరంలో కో ఆపరేటివ్ బేసిస్ మీద కొంత స్థలం సంపాదించి, ప్లాట్లు చేయించి, అప్రూవల్ అది చేయించారు. నిజానికి నాకీ గొడవలతో అట్టే పరిచయం లేకపోవటం వలన వాళ్ళెక్కడ సంతకాలు పెట్టమంటే అక్కడ పెట్టటం తప్ప ఏమీ చెయ్యలేకపోయాను.

ఎలాగైతేనేం? జాగా నా పేరున రిజిస్ట్రేషన్ అయింది.

అప్పుడే ఏదో అరియర్స్ డబ్బు వచ్చింది. దానికి మా ఆవిడ జాగ్రత్త చేసిన డబ్బు కొంత కలిపి జాగా నాదనిపించుకునేసరికి ఒక ఛాప్టర్ క్లోజయి, రెండోది మొదలయింది.

❋

ఒక మంచి రోజు చూచి అడ్వాన్సులు శాంక్షన్ చేసే సెక్షన్‌కి వెళ్ళాను. హౌస్ బిల్డింగ్ అడ్వాన్సుకు అప్లికేషను పట్టుకుని.

"సారీ సార్....ఈ యియరు బడ్జెట్ అయిపోయింది. మీ అప్లికేషన్ యియ్యండి కాని.... అవి నెక్స్ట్ బడ్జెట్ వచ్చేకనే కన్సిడర్ చేస్తాం....'' అన్నాడు అక్కడిక్లర్కు. ఏదో సామెత చెప్పినట్లు ఆదిలోనే హంసపాదు.

నా ముఖకవళికలను గమనించాడు కాబోలు.

"బెటర్ లక్ నెక్స్ట్ యియర్ సార్. ఏదైనా మీ అప్లికేషన్ యిప్పుడే పెట్టారు కాబట్టి, సీనియారిటీ వుంటుంది.''

నన్ను నేను తమాయించుకుని, "నెవర్‌మైండ్'' అంటూ చిరునవ్వు నవ్వి బయట పడ్డాను.

సీట్‌లో కూర్చున్నాక, ఆ ప్లాన్లు అవీ అప్రూవ్ చేయించుకోటానికి ఎంత అవస్థ పడ్డానో గుర్తు వచ్చింది.

ప్లాటు కొన్నాక ప్లాను గీయించాలి ఎవరి చేతనైనా. "మా పెదనాన్నగారు రిటైర్డు ఇంజనీరుకదా ఆయనచేత మన యింటి ప్లాను చేయించుకుందామండీ. ఖర్చులూ కలిసి వస్తాయి. ఎప్పుడే అవసరం వచ్చినా అడుగ వచ్చును.''

మా శ్రీమతి తెలివితేటలు అమోఘం. అందుకే ఆరోజు మేమిద్దరం వాళ్ళ పెదనాన్నగారింటికి బయలుదేరాము.

ప్లాను, ఎస్టిమేట్లు అవీ వెయ్యటానికి ఆయన సులభంగానే ఒప్పుకున్నారు.

నేను జాగా ఎక్కడ కొన్నదీ, నా లోన్ ఎంత వస్తుందీ అన్నీ వివరంగా అడిగారు. మళ్ళీ వారం వస్తే ప్లాన్ వేసి యిస్తానన్నారు.

ప్లాన్ చూసి మా ఆవిడ ముఖం ముడుచుకుంది. "ఏమిటండీ యింత చిన్నప్లాను. ఒక గెస్టురూమ్ లేదు. సామాన్ల కొట్టులేదు.''

"బాగుంది గెస్టురూమ్‌లు అవీ వుండటానికి మనమేం లక్షాధికారులమా. నా కొచ్చేలోన్‌లో యింతకంటే పెద్ద యిల్లు ఎలా అవుతుంది?''

అన్నాను విసుగ్గా.

''ఏ కోపరేటివ్‌లోనేనా తీసుకోండి. జన్మలో ఒక్కసారే కదా యిల్లు కట్టేది మళ్ళీ మళ్ళీ కడతామా ఏమన్నానా ?....''

నిజమే. ప్లానంతా ఒకసారి వేసుకుంటే కలిసి వస్తుంది. మళ్ళీ మళ్ళీ కట్టలేము కదా.

ప్లాన్‌లో ఎలా అయితేనేం యింకొక రూమ్ ఎక్స్‌ట్రా వేయించాను. ప్లాన్ అప్రూవ్ అవటానికి మ్యునిసిపల్ ఆఫీసు చుట్టూ తిరగడం .... అదో పెద్ద కథ. కాళ్ళ చెప్పులు, జేబులో డబ్బులు, ఎవరెవరివో రికమెండేషన్లు, అన్నీ అయితే కాని అది బయటకు రాలేదు.

తీరా ఈ బాలారిష్టాలన్నీ గడచి లోన్‌కి అప్లై చేస్తే....యిది....బడ్జెట్ లేదు.

*

నెక్ట్స్ బడ్జెట్ యియర్‌లో ఎలాగోలా లోన్ ఫస్ట్ యిన్‌స్టాల్‌మెంటు తీసుకున్నాను. అంతడబ్బు ఒక్కసారి చేతిలో పడుతూవుంటే ఒకటే వణుకు. ఇది సవ్యంగా ఖర్చుపెట్టి అనుకున్నది సాధించ గలనా అని....

తీరా డబ్బు శ్రీమతికి స్తే....

''శాస్త్రిలుగారిని పిలిపించి, మంచి ముహూర్తం పెట్టమనండి. పునాది రాయి వెయ్యటానికి....'' అంది.

శాస్త్రిలగారి దగ్గరకు వెళ్ళిన మా అబ్బాయి ముఖం వేలాడేసుకుని వచ్చేడు.

''ఇది మూఢంటనాన్నా. వచ్చేది శూన్య మాసం. రెండునెలల వరకు మంచి ముహూర్తాలు లేవన్నారు.''

నాతోపాటు శ్రీమతికూడ హతాశురాలైంది.

రెండు నెలలు రెండు యుగాల్లా గడిచేయి.

ఇల్లుగలాయన యింకో యాభై అద్దె పెంచాడు.

స్వంత యిల్లు కట్టుకోబోతూ అద్దె యింటికి అద్దె ఎక్కువ చెయ్యటం ఎంత కష్టమో ఎవరికి తెలుస్తుంది ?

అయినా ఒక చిన్న సంతోషం.

వెధవగోల యింకా ఎన్నాళ్ళు. అయిదారు నెలల్లో ఎలాగూ ఖాళీ చేసేస్తామని.

ఇల్లు మొదలెట్టాను. రెండు నెలలు సెలవు పెట్టి దగ్గరుండి కట్టించాలని నిశ్చయించుకున్నాను.

''లేబర్ కాంట్రాక్టుకే యియ్యండి. మెటీరియల్



కాలిపగుళ్ళు

శీతాకాలం వస్తే, చాలామందికి కాళ్ళు పగిలిపోతాయి. వేడిశరీరం కలవారైతే మరీనూ. ముఖం, చేతులు మొదలైన విషయాల్లో సౌందర్య పోషణ చేసుకుంటూ, కాలి పగుళ్ళ విషయంలో చాలా మంది అశ్రద్ధ చేస్తారు. గుగ్గిలాన్ని ఆవు నెయ్యిని సమపాళ్ళలో తీసుకుని, వుడికించి, కాలి పగుళ్ళపై పరుండబోయే ముందు రాసుకుని, ఉదయమే వేడి కుంకుడి రసంతో శుభ్రంచేస్తే, ఒక వారం రోజుల్లో కాలిపగుళ్ళు, యిట్టే మటుమాయం అవుతాయి.

—మల్లిడి కనకరత్నం విజయవాడ

కాంట్రాక్టుకి యిస్తే వాళ్ళు చాలా మోసం చేస్తారు. పాళ్ళు సరిగ్గా కలపరు.'' అని స్నేహితులు సలహా యిచ్చారు.

శ్రీమతి నాలుగు గంటలకల్లా లేచి ఏదో యింత వండి పెడితే ఆ కారియర్ తీసుకుని 8 మైళ్ళు సైక్లింగ్ చేసుకుని వెళ్ళటం ఆ కూలీలతో కాంట్రాక్టర్ను ఎలా పని చేయించుకుంటారో ? వచ్చేది ఎనిమిది గంటలకు.

కబుర్లు చెప్పుకుని, అన్నీ సర్దుకుని, పని మొదలెట్టేసరికి తొమ్మిది.

సరిగ్గా పదిన్నరకల్లా టీ బ్రేకు.

మళ్ళీ ఒంటి గంటకు లంచీ...

నాలుగు గంటలనుండీ కాళ్ళు చేతులు దులపటం మొదలెట్టేవారు.



తలలో పేలు

తలలో పేలువుంటే, పదిమందిలో తల గోక్కుంటూ, (సభామర్యాదలు కూడా పాటించకుండా) కూర్చునేవారి బాధవర్ణనాతీతం! చిడుము, గజ్జి, కోవలోదే ఈ తల్లో పేలు కూడా. పేలు నివారణకోసం, పసుపు, ముద్దకర్పూరం. మాను పసుపు సమాన భాగాలుగా కలిపి నూరి తలకు రాసుకుని, ఎండలో జుట్టు ఆరబోసుకుని ఒక గంట పోయిన పిదప తలకు స్నానం చేస్తే, తలలో పేలు చచ్చిపోతాయి.

ఏదైనా పని యిలా కాదు అలా చేయించండి. అంటే....ఒక పిచ్చివాడి కింద జమకట్టేవారు.

''మీకేటి తెలుసుబాబు ! మేము యిన్ని యిళ్లు కట్టించాము.'' అనేవారు మేస్త్రీ తల మీద వెంట్రుకలు చూపెడుతూ.

పని అట్టే సాగలేదు. పునాదులు లేచాయి. యింతట్లో ఆఫీసు నుండి తాఖీదు ... అర్జంటుగా జాయిన్ అవమని ఏం చెయ్యాలో తోచలేదు.

''మా తమ్ముడు యింటర్ పాసై ఊరికే కూర్చున్నాడు కదా, యిక్కడికి పిలిపిస్తే యిటు మన పనీ చూసినట్లవుతుంది. అటు ఉద్యోగం ప్రయత్నం చేసినట్లవుతుంది.'' సలహా యిచ్చింది శ్రీమతి.

అందుకే కరణేషు మంత్రి అన్నారు.

వెంటనే మా బావమరదిని పంపించమని మామగారికి ఉత్తరం రాశాను.

బావమరది వచ్చారు.

సిమెంటు దొరకటం లేదు.

పర్మిషన్‌కి పెడితే, నాలుగైయిదు బస్తాల చొప్పున యిస్తున్నారు. యింక నేనేం పూర్తి చేస్తాను యిల్లు.

ముందున్న లేబర్‌ను మార్చి మెటీరియల్ కాంట్రాక్టుకి యిచ్చేశాను.

కొత్త మేస్త్రీలు వచ్చారు.

పాత మేస్త్రీ యిక్కడ బాగా కట్టలేదన్నారు.

ఈ గది యిలా కట్టకూడదు అన్నారు.

బీనాదేవి ఏదో కథలో చెప్పినట్లు గుర్తు. ఒక మేస్త్రీ చేసిన పని యింకొక మేస్త్రీ పూర్తిగా కూల తోసి కాని కట్టలేమంటాడు.

మరేం ఫరవాలేదు. దానిమీదే కట్టండి అని చెప్పాను. కాంట్రాక్టరుగారి పని, బావమరిదిగారి సూపర్‌విజన్. ఇంకేం ? వీడిమీద వాళ్ళు చెప్పటం, వాళ్ళమీద వీడు చెప్పటం.

అదంతా అటుంచి, ప్లింత్ లెవల్‌కి వచ్చేలోగా రెండు వేలు అప్పు చెయ్యాల్సి వచ్చింది. అంత వరకు కట్టి చూపిస్తే కాని థర్డ్ యిన్‌స్టాల్‌మెంట్ యివ్వరు కదా. థర్డ్ యిన్‌స్టాల్‌మెంటు తీసి, అప్పు తీర్చి స్లాబు వేసేను.

బావమరదికి ఏదో ఉద్యోగం వచ్చి వెళ్ళిపోయేడు. ఫినిషింగ్స్, ఉడ్ వర్క్, వైట్ వాషింగ్, యింకా ముందే వుంది అంతా.

సూపర్‌విజన్ ఎవరు చేస్తారు?

"మన యింటి ప్రక్కన యింటికి మారి పోదాం. అక్కడ వర్క్ నేను చూసుకోవచ్చు, రేపు గృహప్రవేశానికి యిబ్బంది వుండదు."

శ్రీమతి సలహా ప్రకారం, కట్టబోతున్న యింటి ప్రక్కనే వున్న ఒక పూర్తయిన యింట్లోకి మకాం మార్చాం.

వుడ్‌వర్క్ కోసం, ఏదో శుభకార్యమని చెప్పి, పి. యఫ్. లోన్ తీశాను. ఫినిషింగ్స్ కోసం కోపరేటివ్ లోను.

నుయ్యి త్రవ్వటానికి శ్రీమతి ఒంటిమీద వున్న నాలుగు కాసుల బంగారం బ్యాంకుకి తరలిపోయింది. కాంపౌండు వాల్ సంగతి మరి యిప్పట్లో తలపెట్ట దలచలేదు.

"మనింట్లో యిదే మొదటి శుభకార్యం. బంధువులనీ, స్నేహితులనీ అందర్నీ పిలిచి, గృహ ప్రవేశం ఘనంగా చేయ్యాలి...."

శ్రీమతి మాట ఎప్పుడు కాదన్నాను కనుక?

కడ్తున్న చీటీలు తక్కువగా పాడి, డబ్బు తెచ్చాను. గృహప్రవేశం ఘనంగానే జరిగింది.

మళ్ళీ మళ్ళీ కొంటామా? శ్రీమతికో పట్టు చీర, నాకో మంచి జత టెరీన్‌సూటింగ్, పిల్లలకు కొత్త బట్టలు, యిటు అమ్మ నాన్నకి, అటు అత్త మామలకి బట్టలు, ఊరికెనే ప్లాను గీసిచ్చిన శ్రీమతి పెదనానగార్కి జరీపంచెల చాపు.

అవసరానికి వచ్చి సూపర్‌వైజ్ చేసిన బావ మరిదికో ఉంగరం.


చుట్టాలకి, స్నేహితులకి భోజనాలు, ఆఫీసు వాళ్ళకి, తెలిసిన వాళ్ళకి అల్పాహార విందులు.

అయిన ఖర్చు చూస్తే గుండె గుభిల్లుమంది. యీ డబ్బుతో చక్కగా కాంపౌండ్ వాలైనా, సెప్టిక్ లెవేటరీయేనా వచ్చును.

కాంపౌండ్ వాల్ లేకపోయినా ఆ రెండవది అత్యవసరం కదా. పైని వడ్డీకి తెచ్చి అదీ అయిం దనిపించి కరెంటు వేయించాను. ఇల్లు పూర్తిగా షిఫ్ట్ చేసి కొత్త యింట్లో ప్రవేశించాము.

*

ఎనిమిది మైళ్ళ దూరం నుండి నేను ఆఫీసుకి, పిల్లలు చదువులకి రోజూ వెళ్ళివచ్చేసరికే అలసట వచ్చేస్తూంది. ఆదివారం వస్తే అసలెక్కడికీ కదలా లనిపించడం లేదు. సినిమాలూ, షికార్లు బంద్.



అందంగా ఆరోగ్యంగా వుండాలంటే మొట్ట మొదట వదిలించుకోవలసింది బద్ధకం. బద్ధ కాన్ని వదిలించుకుని కాస్త చురుకుదనం అల వరచుకున్నట్లయితే అందం ఆరోగ్యం వాటంతట అవే మనల్ని వెతుక్కుంటూ వస్తాయి. తెల్లవారేకల్లా నిద్ర లేవడం; బాగా గాలివీచే స్థలంలో తేలిక వ్యాయామం చేయడం ఉద్యోగినులైన వనితలు రోజంతా చురుకుగా వుండడానికి ఎంతైనా దోహదం చేస్తుంది. శరీరంలోని అనవసరమైన కండరాలను తగ్గి స్తుంది. సక్రమమైన వ్యాయామంతో పాటు ఆహారంలో క్రొవ్వు పదార్థాలను, పప్పులను తగ్గించి, ఆకుకూరలు, పళ్లు, మజ్జిగ బాగా తీసుకోడం వల్ల అందం, ఆరోగ్యంతో పాటు ఆయుస్సు కూడా పెరుగుతుంది.

స్వంత యింట్లో ఉంటున్నామన్న సరదా ఎవరి ముఖాల్లోనూ లేదు.

శ్రీమతికైతే మరీను. చుట్టూ ఆట్టే యిళ్ళు లేకపోవటం వలన మేమందరం వెళ్ళిపోయాక అస్సలు కాలక్షేపం కావటం లేదు. పోనీ ఏ మొక్కా, మొడీ పెంచుదామన్నా, కాంపౌండ్ వాల్ లేదు.

లోన్ కటింగ్ మొదలెట్టేసరికి గుండె గుభిల్లు మంది. ఫైనాన్షియల్ ఎడ్జస్ట్‌మెంట్ కోసం, తప్పని సరిగా రెండు గదులు అద్దెకిచ్చేయవలసి వచ్చింది. పిల్లలు ముఖం మాడ్చుకున్నా చేసేది లేదు.

ఆ రోజు.... జీతాలందేయి.

లెఖ్ఖలు వేస్తున్నాను.

హౌస్ బిల్డింగ్ అడ్వాన్సు, పి. యఫ్. లోను, కోపరేటివ్ లోను, అన్నీ కటింగ్ అయిపోగా ఆరు వందలు చేతికి వచ్చింది. దీనితో యిల్లెలా గడుస్తుంది? చీటీలెలా కడ్తాను? వడ్డీలెలా తీరుస్తాను.

తల తిరుగుతూంది. నాలుక పిడచ కట్టుకు పోతోంది.

"మంచి నీళ్ళు...." కేక వేశాను.

శ్రీమతి మంచి నీళ్ళు తెచ్చింది.

ఆమె చేతికున్న మట్టి గాజులు, మెడలోని పసుపుతాడు చూస్తున్నాను.

"ఏమిటండీ అలా చూస్తున్నారు?" ఆశ్చ ర్యంగా అడిగింది.

"అబ్బే...ఏం లేదు...." గ్లాసుడు నీళ్ళు గటగటా త్రాగేసరికి ప్రాణం కుదుటపడింది.

అబ్బ ఈ నీళ్ళు...కొబ్బరి నీళ్ళలా ఎంత తియ్యగా వున్నాయి? రెండు బారలు వేస్తే చాలు. నీరు....తియ్యటి నీరు. టౌన్లో ఈ నీటి కోసం ఎంత యిబ్బంది పడేవాళ్ళం? అర్ధరాత్రి లేచి పట్టు కుని, కావిళ్ళలో పోయించుకుని... "మరో గ్లాసుడు నీళ్ళు తీసుకురా..." గ్లాసు చేతికిచ్చాను.

శ్రీమతి వెను తిరిగింది. రయ్యిమని గాలి వీచింది. శ్రీమతి పైట చెంగు ముఖంమీద పడింది. చేతిలోని వద్దు కాగితం ఎగిరిపోయింది.

"అబ్బ ఎంత హాయిగా వుంది? టౌన్లో యిరవై నాలుగ్గంటలు ఫాన్ వుంటే కాని గడిచేది కాదు."

నాలో నేనే నవ్వుకోబోయి గట్టిగా నవ్వేశాను.

మంచి నీళ్ళతో తిరిగి వచ్చిన శ్రీమతి ఆశ్చర్య పోయింది.

"ఏమిటండీ....?" అంది భయపడ్తూ.

"అబ్బే....యిది మన స్వంత యిల్లేనా అని అనుమానం వేస్తూంది. అద్దె యింట్లో అయితే హాయిగా నెలకి రెండు వందలు అద్దె పడేస్తే ఏ బాదరబందీ లేకుండా వుండేది."

"ఇప్పుడు మాత్రం యిది స్వంత యిల్లని ఎలా అనుకోగలం.... నెలకయిదు వందలు కటింగులు, యింకా చీటీలు, వడ్డీలు, టాక్సులు పోగా, రెండు గదులింట్లో, నెలకు ఎనిమిది వంద లిచ్చి ఉంటున్నామన్న మాట. యింక తినటానికేం మిగుల్తుంది?"

క్షణం మంచినీళ్ళ గ్లాసువేపు చూశాను. "అబ్బే తినడం ఎందుకు? ఈ తియ్యటి నీరు త్రాగుతూ, ఈ చల్లని గాలి పీలుస్తూ, హాయిగా గడిపెయ్య వచ్చు... ఏమంటావ్?"

ఏమంటుంది శ్రీమతి? తనూ బహుశా లోలోన లెఖ్ఖలు వేస్తోంది కాబోలు.

"కొనితెచ్చు పీడతా కొంపలమెల్ల...."

చిన్నప్పుడు అమ్మ చదివే శివ మానసిక పూజ లోని వాక్యం గుర్తు వచ్చి, ఆ పరమేశ్వరునికి మనస్సులోనే నమస్కరించేను. □



251